





మహానాడు ప్రాంగణంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, రితేష్ రెడ్డి

## నేడు సభాభవన్‌లో పీజీఆర్ఎస్

● డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతోందని, అలాగే ఉదయం 9-30 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీకోసం కాల్‌సెంటర్ నెంబరు 1100 సేవలను వినియోగించుకోవాలని అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించి సమాచారం తెలుసుకోవాలన్నా పై నెంబరుకు కాల్ చేయవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి



విలేకరులతో మాట్లాడుతున్న నారాయణ

కడప ఎర్రముక్కపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. ఆదివారం కడప కలెక్టరేట్ వీసీ హాల్లో ఇంటి పన్నులు, పన్నుల డిమాండ్, అసెస్‌మెంట్, టౌన్‌ప్లానింగ్ తదితర అంశాలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఉమ్మడి జిల్లా మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పన్నుల వసూళ్ల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వాటర్ ట్యాక్స్, అడ్వర్‌టైజ్‌మెంట్, ట్రేడ్ లైసెన్స్, షాప్ రెంట్లు, బిల్డింగ్ చార్జీల వసూళ్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని, ఇంకా అసెస్‌మెంట్ కానీ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఆదాయం పెరగాలంటే టౌన్‌ప్లానింగ్, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందాలని తెలిపారు. కడప నగరంలో 387 షార్ట్‌ఫాల్స్ సమస్యలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలో మాస్టర్ ప్లానింగ్ అంశాల్లో అవకతవకలు జరిగాయని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని, గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని, వాటిని గాడిన పెడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్, టౌన్‌ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ్‌కుమార్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర, మున్సిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇతర అధికారులు హాజరయ్యారు.

## బందోబస్తు సమర్థవంతంగా నిర్వహించండి

● పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశా నిర్దేశం



కడప క్రైం/సీకేదిన్నె, మే 25 (ఆంధ్రజ్యోతి): మహానాడు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో సీఎం నారాచంద్రబాబు నాయుడు పర్యటన ఉన్న నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. సీఎంతో పాటు పలువురు వీఐపీలు, మంత్రులు మహానాడులో పాల్గొననున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి కడప ఎస్పీ, అన్నమయ్య ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, నార్కోటిక్స్ ఎస్పీ నగేశ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం మహానాడు వేదిక, జయరాజ్ గార్డెన్స్ హాలు, మాధవీ కన్వెన్షన్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. సీఎం, ఇతర మంత్రులు వీఐపీలు విచ్చేసింది మొదలు తిరిగి వెళ్లేంత వరకు చేపట్టాల్సిన బందోబస్తును సెక్టార్ల వారీగా విభజించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా రూపొందించిన బందోబస్తు ప్రణాళికను వివరిస్తూ సెక్టార్ల వారీగా విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రూట్ బందోబస్తు, ట్రాఫిక్ డైవర్షన్, క్లియరెన్స్ తదితర సెక్టార్ల అధికారులకు ఏం చేయాలో, ఏం చేయకూడదో ఎస్పీ వివరించారు. సమావేశంలో జిల్లా, ఇతర జిల్లాల నుంచి బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహానాడుకు సర్వం సిద్ధం

● దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తి

● నేడు మంత్రి నారా లోకేశ్ రాక

● 5 వేల మంది పోలీసులతో పహారా

● ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల బృందం

(కడప-ఆంధ్రజ్యోతి): రాయలసీమ నడిబొడ్డు కడప గడపలో నిర్వహించనున్న మహానాడుకు సర్వం సిద్ధమైంది. మహావేదిక దాదాపు పూర్తయింది. చిత్తూరు - కడప - కర్నూలు జాతీయ రహదారి కడప శివార్లలోని రింగు రోడ్డు పక్కనే ఇటు బహిరంగసభ, అటు వాహనాల పార్కింగ్ అన్నీ బాగా ఈ వేదికకు కలిసి వచ్చాయి. పదిరోజుల క్రితం ఈ ఏరియా అంతా మొక్కలతో నిండి ఉండేది. అయితే ఆదివారం నాటికి అది ఓ సిటీనే తలపించే విధంగా తయారైంది. రేపటి నుంచి మూడు రోజుల పాటు మహానాడు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారాలోకేశ్ సోమవారం ఉదయం 9 గంటలకు కుప్పంలో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు మహానాడు వేదిక వద్దకు చేరుకోనున్నారు.

### సర్వం సిద్ధం

2004 నుంచి 2019 వరకు కడప జిల్లావాసులు వైఎస్ ఫ్యామిలీకి అండగా ఉన్నారు. 2004-09 ఎన్నికల్లో అప్పటి వైఎస్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ జైకొడితే 2014-19 ఎన్నికల్లో జగన్ నేతృత్వంలోని వైసీపీకి జనం మెజార్టీ సీట్లను కట్టబెట్టారు. అయితే 2024లో సీన్ రివర్స్ అయి ఉమ్మడి జిల్లాలో 10 స్థానాలకు గాను 7 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. మహానాడును ఈసారి రాయలసీమలో నిర్వహించాలనుకుంటుండగా కడప బెస్ట్ అని నిర్ణయించారు. ఇప్పటి వరకు నిర్వహించిన మహానాడులో వేదిక ఒకచోట, వాహనాల పార్కింగ్ ఇంకోచోట ఉండేది. అయితే ఇప్పుడు ఒకేచోట ప్రతినిధుల సభ, బహిరంగసభ ఆ పక్కనే వాహనాల పార్కింగ్ స్థలం పక్కనే ఉంది. టీడీపీ మహానాడు చరిత్రలోనే ఇంత అద్భుతమైన ప్రదేశం దొరకలేదని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటిస్తూ వచ్చారు. బహిరంగసభ జరిగే పక్కనే పార్కింగ్ ఉంది.



మహానాడు వేదిక ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మాధవి, మాజీ మంత్రి దేవినేని ఉమా, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

### 5 వేల మంది పోలీసులతో బందోబస్తు

మహానాడు సందర్భంగా అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. 5 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లాకు సంబంధించి 15 చోట్ల అన్ని జిల్లాల బార్డర్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, మహానాడు వేదిక భద్రతకు 15 మంది ఐపీఎస్ అధికారులు, 30 మంది అడిషనల్ ఎస్పీలు, 60 మంది డీఎస్పీ స్థాయి, 200 మంది సీఐలు ఎస్ఐలు బందోబస్తులో ఉంటారన్నారు. ట్రాఫిక్, పార్కింగ్‌లకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.న 120 కెమెరాలతో మహానాడు ప్రాంగణాన్ని పర్యవేక్షిస్తామని, అత్యాధునిక డ్రోన్స్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు సంబంధించి 13 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేకంగా డైవర్షన్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



పనులను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పట్టాభి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు


### పనులన్నీ దాదాపు పూర్తి

మహానాడుకు సంబంధించి కీలకమైన నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. 27, 28 తేదీల్లో రెండు రోజులు ప్రతినిధుల సభ జరగనుంది. ఇందుకోసం వేదిక దాదాపు పూర్తయింది. వేదిక 164 అడుగులు వెడల్పు, 500 అడుగుల పొడవుతో ఏర్పాటు చేసిన వేదికపై సుమారు 400 మందికి పైగా కూర్చోవచ్చు. కింద 20 వేల మంది వరకు కూర్చోవచ్చు. ఇక భోజనశాలకు సంబంధించి వీవీఐపీల కోసం 80 అడుగుల వెడల్పు 100 అడుగుల పొడవు, డెలిగేట్స్ కోసం వంద అడుగుల వెడల్పు, 200 అడుగుల పొడవు చొప్పున రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. చివరిరోజు ఐదు లక్షల మందితో బహిరంగసభ నిర్వహించనున్నారు. ఇందుకోసం వేదికనే 120 మీటర్ల వెడల్పుల 80 అడుగుల పొడవుతో నిర్మించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మహానాడు ప్రాంగణంలోనే బస చేయనున్నారు. ప్రాంగణాన్ని 1200 అడుగుల పొడవు, 600 అడుగుల వెడల్పుతో నిర్మించారు. 32 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. దాదాపు కేవలం సీటింగ్ కోసమే 3 లక్షల మంది వరకు కూర్చోనున్నారు. చుట్టుపక్కల స్టాండింగ్ కోసం స్థలం ఏర్పాటు చేశారు. అంటే ఐదు లక్షలమంది ఉండే విధంగా చూశారు.



భోజన వసతి పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తదితరులు

### వర్షంతో పనులకు ఆటంకం



మహానాడు ప్రాంగణంలో కురుస్తున్న వర్షం

ఆదివారం సాయంత్రం కడప నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో పనులకు అంతరాయం ఏర్పడింది. మహానాడు ప్రాంగణమంతా బురదమయంగా మారింది. బహిరంగసభ జరిగే వేదిక వద్దకు కూడా వర్షం నీరు వచ్చింది. దీంతో మంత్రి నిమ్మల రామానాయుడు వేదికను పరిశీలించి వర్షం ఆగిపోయిన వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు.

### నభూతోనభవిష్యత్తు

- మంత్రి అచ్చెన్నాయుడు

కడప మహానాడును నభూతో నభవిష్యత్‌గా నిర్వహిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కడపలో మహానాడుకు ఇంత మంచి గ్రౌండ్ దొరకడం ఆనందంగా ఉంది. మహానాడులో పార్టీ పటిష్టత, సంస్థాగత సభతో పాటు రాష్ట్రాభివృద్ధిపై చర్చ నడుస్తుంది. నారా లోకేశ్ పాదయాత్రలో భాగంగా రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. మహానాడులో సీమ కోసం ఏం చేయాలో వెల్లడిస్తారు. మహానాడును అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఆర్.మాధవి తెలిపారు. మహానాడుకు దాదాపు 50 వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అందరికీ భోజన ఏర్పాట్లు చేశామని స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభి వెల్లడించారు. మహానాడులో పారిశుధ్యంకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మహానాడు సందర్భంగా మహానాడు కోసం వచ్చే నేతలు, కార్యకర్తలు, ప్రజల కోసం ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను మంత్రి బీసీ జనార్ధనరెడ్డి పరిశీలించారు. పులివెందుల రోడ్డు, కర్నూలురోడ్డు, బద్వేలు రోడ్డులో భోజన ఏర్పాట్ల కేంద్రాలు పరిశీలించారు. మహానాడులో పారిశుధ్యంపై కార్మిక శాఖ మంత్రి సుభాష్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాంగణాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, కొల్లురవీంద్ర తదితరులు పరిశీలించారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మహానాడుపై వసతి, బహిరంగసభపై మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కొల్లురవీంద్ర, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాజేంద్ర, రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొని చర్చించారు. మహానాడులో కీలకమైన డెలిగేట్ సభ వేదిక దాదాపు పూర్తయింది. బహిరంగసభ కూడా పూర్తి కావచ్చింది.సీఎం బస, సీఎంవో ఆఫీసు, రక్తదాన శిబిరం, భోజనశాల ఇలా అన్నీ పూర్తికావచ్చాయి.



ఎమ్మెల్యేలు, మంత్రులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

## ప్రజాధనాన్ని లూటీ చేస్తే శిక్ష తప్పదు

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

● మద్యం కేసులో జగన్, వివేకా కేసులో అవినాశ్ ఊచలు లెక్కపెట్టాల్సిందే

● బీటెక్ రవి



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

పులివెందుల, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల పాటు ప్రజాధనాన్ని లూటీ చేసిన వారికి శిక్ష తప్పదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కడపలో జరగనున్న మహానాడు ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన ఆయన పులివెందుల టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు ప్రజలను మోసగించి ప్రజాధనాన్ని లూటీ చేసిందని, బంధాలను, బంధుత్వాలను మంటగలిపిన వారు ఊచలు లెక్కించాల్సిందేనన్నారు. గాలి జనార్దన్‌రెడ్డి విషయంలో ఇది స్పష్టమైందని తెలియజేశారు. కడప గొప్పతనాన్ని ప్రపంచంలోని తెలుగువారందరికీ తెలియజెప్పాలని సీఎం చంద్రబాబు ఇక్కడే మహానాడు నిర్ణయించారన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మహానాడు మొట్టమొదటిసారి కడపలో నిర్వహించడం పట్ల ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో భవిష్యత్తులో రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని, పులివెందులలో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిని సాధించడమే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) మాట్లాడుతూ మహానాడు లాంటి పండుగను కడపలో జరుపుకొనే అవకాశం ఇచ్చిన చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుతున్నామన్నారు. చిత్రావతి, పైడిపాళెం రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపిన ఘనత వారిదేనన్నారు. గత ప్రభుత్వంలో అదనంగా ఒక్క ఎకరాకూ నీరు ఇవ్వలేదన్నారు. గత ఐదేళ్లలో డ్రిప్ లేక ఇక్కడి రైతులు ఇబ్బందిపడ్డారని, అడిగితే బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే గత ఐదేళ్లు ఆయనకు నచ్చిన బ్రాండ్లను ప్రజలతో తాగించిన వ్యక్తి ప్రపంచంలో ఎక్కడా లేరని పేర్కొన్నారు. మద్యం కేసులో జగన్‌రెడ్డి, వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డి తప్పించుకునే సమస్య లేదన్నారు. వచ్చే మహానాడు నాటికి వీరంతా జైలు జీవితం గడుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్‌బాషా, విశ్వనాథరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు ఏపీఈఏపీసెట్-2025

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 27న జరగనున్న ఏపీఈఏపీసెట్-2025 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంటన్నర ముందే హాజరు కావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఓఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్స్, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ కళాశాలలు మహానాడు వేదికకు సమీపంలో ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉదయం 7-30 లోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. ఏదైనా సమస్య వస్తే కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 9121100531, 9121100515కు కాల్ చేయవచ్చని సూచించారు.

## పోట్లదుర్తిలో మహావిడిది

● మహానాడుకు వచ్చే ఎంపీలు, మంత్రులకు ఆతిథ్యం

ఎర్రగుంట్ల, మే 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్ పుట్టినరోజు నిర్వహించే మహానాడుకు పోట్లదుర్తి 'మహా'విడిది కల్పిస్తోంది. 27, 28, 29 తేదీల్లో కడపలో మహానాడు వేడుకలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీ ఆవిర్భవించి సుమారు 42 ఏళ్లు దాటినా మొదటిసారిగా ఈ వేడుకలు కడపలో నిర్వహిస్తుండటం గమనార్హం. దీంతో ఇక్కడి నాయకులు దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్ని ఏర్పాట్లు ఘనంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు పార్టీకి చెందిన అతిరథ మహారథులంతా కడపకు విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఆతిథ్యమిచ్చేందుకు పోట్లదుర్తి వేదిక కానుంది.

● మహామహులంతా ఇక్కడికే...

మహానాడు వేడుకల్లో పాల్గొనేందుకు మహామహులంతా పోట్లదుర్తికే వస్తున్నారు. వారిలో కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు వేమినేని ప్రభాకర్‌రెడ్డి, కేశినేని నాని, సానా సతీష్, మాగుంట శ్రీనివాసరెడ్డి, అప్పలనాయుడు, తేనేటి క్రిష్ణప్రసాద్, దగ్గుమల్ల ప్రసాద్‌రావు, మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొల్లురవీంద్ర, నారాయణ, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణ, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరావు, మాజీ ఎంపీలు కనక మూడల రవీంద్ర, వైజాగ్ మేయర్ పీలా శ్రీనివాస్, కేబినెట్ మంత్రులు, అన్ని శాఖల కమిషనర్లు, మంత్రుల పీఏలు, ఇలా అనేక మందికి ఇక్కడ ఆతిథ్యం ఇస్తున్నారు. అచ్చెన్నాయుడు ఇప్పటికే పోట్లదుర్తికి చేరుకుని మహానాడు ఏర్పాట్లపై పరిశీలించారు. సీఎం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. మిగతా మంత్రులంతా సోమవారం చేరుకోనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు సీఎం.సురేష్‌నాయుడు తెలిపారు. కాగా రాష్ట్రంలోని మంత్రులు, కేంద్ర మంత్రులు, ఇక్కడికి రానుండడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక ఎర్రగుంట్ల మండలం లోని అల్ట్రాటెక్, జువారి, ఆర్టీపీపీ అతిథి గృహాలు, ఇతర కళ్యాణమండపాలు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు నాయకులకు, అధికారులకు, వారి పీఏలకు, సెక్యూరిటీ సిబ్బందికి మూడురోజుల పాటు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఇప్పటికే జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్ పర్యవేక్షించారు.



మంత్రి అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న సీఎం.సురేష్‌నాయుడు, ఆయన తండ్రి మునిస్వామినాయుడు

# విజ్ఞానం... వినోదం...

- చిన్నారుల్లో సృజనకు బీజం...వేసవి శిక్షణ శిబిరం
- కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు పేరుతో పీలేరు గ్రంథాలయంలో చిన్నారులకు శిక్షణ

పీలేరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా పుస్తకాలు, హోం వర్కులు, అసైన్‌మెంట్లతో సిగపట్లు పడుతూ, కేజీల కొద్దీ స్కూల్ బ్యాగులు మోస్తూ అలసిపోయిన చిన్నారి హృదయాలకు వేసవి సెలవులు పెద్ద ఉపశమనం. అందుకే వేసవి సెలవులు ఎప్పుడెప్పుడు వస్తాయా అంటూ చిన్నారులు ఎదురుచూస్తూ ఉంటారు. ఆ సెలవుల్లో అమ్మమ్మ, నానమ్మ ఊళ్లకు వెళ్లి నెల రోజులపాటు హాయిగా గడపవచ్చునని వారి ఆశ. అయితే సెల్‌ఫోన్లు, టీవీల కారణంగా చిన్నారుల దైనందిన అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగా అవే వేసవి సెలవులు వారికి పెద్ద శాపంలా మారవచ్చునంటున్నారు మానసిక శాస్త్ర నిపుణులు. అప్పటి వరకు పుస్తకాల నడుమ గడిపిన వారు సెలవుల్లో దొరికిన విరామాన్ని సెల్‌ఫోన్లు, టీవీలకు అలవాటుపడితే పెద్దప్రమాదమే పొంచి ఉందని వారు హెచ్చరిస్తున్నారు. పిల్లలు వాటికి అలవాటుపడకుండా వారిని డ్రాయింగ్, డ్యాన్స్, చెస్, కథలు రాయడం, కథలు వినడం వంటి అనేక సృజనాత్మక కళలు, క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని వారు సూచిస్తున్నారు. పెద్దపెద్ద పట్టణాల్లో అయితే అనేక సంస్థలు వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా పిల్లల కోసం అనేక రంగాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంటాయి. చిన్న చిన్న గ్రామాల నుంచి ఓ మోస్తరు పట్టణాల్లో అటువంటి సౌకర్యం ఉండదు. కానీ జిల్లా గ్రంథాలయ సంస్థ 'వేసవి విజ్ఞాన తరగతులు' పేరుతో చిన్నారుల కోసం ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తోంది. గ్రంథాలయం ఉన్న ప్రతి ఊరిలోనూ ఈ శిబిరాలను ఏర్పాటు చేసింది. ఆ క్రమంలో పీలేరులోని పద్మావతి నగర్‌లో ఉన్న శాఖా గ్రంథాలయంలోనూ చిన్నారులకు క్యారమ్స్, చెస్, శాస్త్రీయ సంగీతం, డ్రాయింగ్, పుస్తక పఠనం, కథలు చెప్పడం, కథలు రాయడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవులలో విద్యార్థులు, చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపయోగపడతాయని పలువురు ఉపాధ్యాయులు సైతం బలపరుస్తున్నారు. పీలేరులోని గ్రంథాలయంలో ప్రస్తుతం 25 మంది చిన్నారులు ప్రతిరోజూ అనేక అంశాల్లో శిక్షణ పొందుతున్నారు.

### జూన్ 6 వరకు విజ్ఞాన తరగతులు

వేసవి సెలవులు ఈ ఏడాది ఏప్రిల్ మాసం చివరి నాటి నుంచి మొదలయ్యాయి. అయితే గ్రంథాలయ సంస్థ ఆ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు తమ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా పీలేరు గ్రంథాలయంలో ప్రస్తుతం చిన్నారులకు డ్రాయింగ్, చెస్, క్యారెమ్స్, సంగీతం, శాస్త్రీయ నృత్యం, కబడ్డీ, కథలు రాయడం, కథలు చెప్పడం వంటి అనేక అంశాల్లో ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు స్థానిక గ్రంథాలయాధికారి అమరనాథ్. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలు వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కొంతమంది చిన్నారులు సాయంత్రం పూట కూడా వస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో కూడా పట్టు సాధించాలన్న తపనతో పలువురు ప్రభుత్వ ఇంగ్లిష్ ఉపాధ్యాయులను సంప్రదించి పాఠాలు చెప్పిస్తున్నారు. ఎటువంటి రుసుము లేకుండా కేవలం విద్యార్థుల సంపూర్ణ వికాస అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

#### సద్వినియోగం చేసుకోవాలి



వేసవి విజ్ఞాన తరగతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. పెద్దపెద్ద పట్టణాల్లో పెద్ద మొత్తాల్లో ఫీజులు వసూలు చేసి నేర్పే అనేక అంశాలను మేము ఆయా రంగాల్లో నిష్ణాతుల ద్వారా ఉచితంగా బోధిస్తున్నాం. ఏడాది పొడవునా పుస్తకాలతో పోటీ పడే చిన్నారులు వేసవి సెలవుల్లో తమలో దాగి ఉన్న సృజనాత్మకతను తెలుసుకునేందుకు వేసవి శిబిరం ఉపయోగపడుతుంది. తద్వారా విద్యార్థి జీవితంలో ఉండే ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది.

\- అమరనాథ్, గ్రంథాలయాధికారి, పీలేరు



పుస్తక పఠనంలో చిన్నారులు



గ్రంథాలయంలో యోగా నేర్చుకుంటున్న చిన్నారులు



చెస్, క్యారెమ్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

## పేర్ని నానీ.. తైతక్కలాడే పద్ధతి మానుకో..

- లిక్కర్ స్కామ్‌లో జగన్ అరెస్టయితే నీ గతేంటో..
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కడప మారుతీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీని ప్రజలు ఛీత్కరించుకున్నప్పటికీ పిచ్చిపిచ్చి ప్రేలాపనలాడుతున్న పేర్ని నాని తైతక్కలాడే పద్ధతి మానుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హితవు పలికారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు ముసుగులో కడపలో దగానాడు సభలను నిర్వహిస్తున్నారని పేర్ని నాని నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలమయం చేశారన్నారు. ఎక్కడైనా ఒక్కటంటే ఒక్క తట్ట మట్టి కూడా పోయలేని దుస్థితిలో పాలన సాగించారన్నారు. క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని, కనుకనే ఆత్మాభిమానం చంపుకోలేక వైసీపీని వీడానన్నారు. మహిళలంటే చంద్రబాబుకు ఎనలేని గౌరవమని, కనుకనే బియ్యం అక్రమ రవాణాలో నీ భార్య అడ్డంగా దొరికినా సాక్ష్యాధారాలు దొరికే వరకూ ఇబ్బంది పెట్టకూడదన్న మంచి మనసున్న నాయకుడు చంద్రబాబు అన్నారు. లిక్కర్ స్కామ్‌లో జగన్ జైలుకెళ్లబోతున్నారని, అప్పుడు నీ గతేంటో చూస్తామన్నారు. సమావేశంలో టీడీపీ మీడియా జనరల్‌సెక్రటరీ జనార్ధన్ పాల్గొన్నారు.

## మహానాడు విజయవంతం అవుతుంది

- పులివెందుల నియోజకవర్గం నుంచి 20వేల మంది
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, బీటెక్ రవి




వేంపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడు విజయవంతం అవుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మహానాడు ఏర్పాట్లలో భాగంగా పులివెందులకు వచ్చిన ఆయన వేంపల్లె ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో రాయలసీమ జిల్లాల్లో టీడీపీపై ప్రజలు ఎనలేని అభిమానం చూపించారని, అందుకు కృతజ్ఞతగానే కడపలో మహానాడును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదావరి-బనకచెర్ల ప్రాజెక్టుతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం నుంచి ప్రస్తుతానికి 15వేల మంది నుంచి 20వేల వరకు మహానాడుకు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ మహానాడు : మంత్రి సుభాష్



సీకేదిన్నె, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడును స్వచ్ఛ మహానాడుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మహానాడును విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ తుది దశకు చేరుకున్నాయన్నారు. స్వచ్ఛ మహానాడుగా నిర్వహించడంలో వలంటీర్లు, ఐటీడీపీ చాంపియన్లు కీలకపాత్ర వహించాలన్నారు. వచ్చిన ప్రతినిధులకు అవసరమైన టాయిలెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, ఎక్కడ ఎటువంటి చిన్న వాటర్ బాటిల్ కూడా కనిపించకుండా పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రతినిధుల సమావేశ ప్రాంగణం ముందు 50 టాయిలెట్స్, మీడియా సెంటర్‌లో 10, వీవీఐపికి 10, కమాండ్ కంట్రోల్, సీఎం బస వద్ద, వంటశాల వద్ద ఏడు, పార్కింగ్ ఏరియాల్లో 150 టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత పట్టాబి, గోవవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గండికోట ప్రాజెక్టులో 17.2 టీఎంసీల నీరు



కొండాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో 17.235 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. ఎండాకాలం కావడం, ప్రాజెక్టు నుండి అనుబంధ రిజర్వాయర్లకు నీరు విడుదల చేస్తుండటంతో నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా సర్వరాయసాగర్‌కు 250 క్యూసెక్కులు, తాగునీటి స్కీమ్‌కు 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఏమి లేదని తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం 26.85 టీఎంసీలు.

## సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించిన ఎస్పీ



కడప క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లపై ఆదివారం పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు నుండి సీఎం కార్యక్రమం నిర్వహించే పబ్బాపురం వేదిక వరకు కాన్వాయి రిహార్సల్స్ నిర్వహించారు. ఎయిర్‌పోర్టు నుండి కాన్వాయి వచ్చే మార్గంలో చేపట్టవలసిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యశాఖ డీడీగా రాఘవరెడ్డి

కడప రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ డిప్యూటీ డైరక్టర్(డీడీ)గా రాఘవరెడ్డిని నియమించారు. ఈ మేరకు మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం నుండి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన నంద్యాల జిల్లాలో జేడీగా పనిచేస్తున్నారు. ఇక్కడ డీడీగా పనిచేస్తున్న రెడ్డయ్యను ఇటీవల ఎందుకో తప్పించారు. ఈ క్రమంలో రాఘవరెడ్డి నేడో రేపో బాధ్యతలు చేపట్టనున్నారు.

## రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన గణేష్ ఫైల్‌ఫొటో

రాజంపేట టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మన్నూరు శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి కడప-చెన్నై జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని యర్రబల్లెకు చెందిన గణేష్(16) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా సాయిగౌడ్, హర్షవర్ధన్, వెంకటేశ్ (శ్రీను)లకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గణేష్ పదో తరగతి పూర్తి చేసుకుని పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో స్నేహితుడితో బోయనపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మరో వాహనంపై ముగ్గురు వ్యక్తులు అతి వేగంతో మన్నూరు పద్మప్రియ కల్యాణమండపం సమీపంలో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు గాయపడిన వారిని 108 సహాయంతో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. సాయిగౌడ్, హర్షవర్ధన్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టంకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

### కారు ఢీ : ఇరువురికి గాయాలు

సిద్దవటం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి మాధవరం సమీపాన రాత్రి తిరుపతి వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇరువురికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న గంగాధర్, సుబ్రమణ్యంలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు ప్రైవేటు వాహనంలో తరలించారు. ఘటన స్థలానికి హైవే పెట్రోలింగ్ పోలీసులు చేరుకొని విచారిస్తున్నారు.

# కడపలో మహానాడు జరగడం అదృష్టం

- ప్రతి టీడీపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పుల్లారావు, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్

రాజంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ పండుగ కార్యక్రమం జరగడం ఈ ప్రాంతీయులు చేసుకున్న అదృష్టమని, మహానాడు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అందరూ తరలిరావాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు తెలిపారు. మహానాడు జనసమీకరణ కార్యక్రమంలో భాగంగా రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో జరిగే మహానాడులో ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేసి భారీ ఎత్తున జనసమీకరణ చేయాలన్నారు. జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలో రాజంపేట నియోజకవర్గం నుంచి వేలాది మంది టీడీపీ కార్యకర్తలు మహానాడుకు రావాలన్నారు. వైసీపీ పాలనలో రాజంపేట నియోజకవర్గం అన్నివిధాలుగా నష్టపోయిందని, అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు ఎత్తకపోవడంతో తెగిపోయిందన్నారు. ప్రాజెక్టు తెగిపోయి 41 మంది చనిపోతే ఏ బాధితుడిని ఆదుకోలేదని, కనీసం పరామర్శించలేదన్నారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు అన్నమయ్య బాధితులను ఆదుకున్నారన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని, రైతులందరికీ తాగునీరు అందిస్తామన్నారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం నుంచి మహానాడుకు వెయ్యి వాహనాల్లో కార్యకర్తలను సమీకరిస్తామని వెల్లడించారు. మహానాడు విజయవంతానికి తమ వంతుగా అన్నివిధాలా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజంపేట పరిశీలకుడు దుర్గాప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు, పత్తిపాటి పుల్లారావులను జగన్‌మోహన్‌రాజు ఘనంగా సన్మానించారు.

## చరిత్ర తిరగరాసేలా మహానాడు

- తెలుగు పండుగకు అందరూ రావాలి
- మంత్రి కొండపల్లె శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లె శ్రీనివాస్

బద్వేలుటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): తొలిసారిగా కడపలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు చరిత్ర తిరగరాసేలా ఉంటుందని ఎంఎస్ఎంఈ సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికార సంబంధాల శాఖ మంత్రి కొండపల్లె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డితో మహానాడు జనసమీకరణతో పాటు మహానాడు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై మహానాడు వేదికపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి దృఢసంకల్పంతో ఉన్నారన్నారు. మహానాడు పండుగకు తెలుగువారందరినీ ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి ఇక్కడకు పంపించారని, అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బద్వేలు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి మహానాడును దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తుగ్గల నాగేంద్ర, కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, రైస్‌మిల్లు ప్రసాద్, బిగ్‌బాస్, మిత్తికాయల రమణ, జహంగీర్‌బాష, జీవి సుబ్బారెడ్డి, శివయ్యస్వామి, అన్నిమండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా చేయడమే లక్ష్యం





హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామేశ్వర్ గౌడ్

కడప ఎడ్యుకేషన్, మే 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా చేయాలన్నదే తన లక్ష్యమని విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ డైరెక్టర్ ఎ.రామేశ్వర్‌గౌడ్ అన్నారు. కడప కార్పొరేషన్ సమావేశ హాలులో ఆదివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 50వేలకు పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 10వేలకు పైగా ఉపాధ్యాయులకు ఇంత వరకు ఉచితంగా ఆంగ్లభాష నైపుణ్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఆంగ్లభాష నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారు విద్యార్థులకు నేర్పిస్తారని, అందుకే వారికి పూర్తి ఉచితంగా 40రోజుల ఆన్‌లైన్ శిక్షణ, ఏపీలోని వివిధ జిల్లా కేంద్రాలలో ఒక్కరోజు ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప ఇంగ్లిష్ ఫోరం నాయకులు సురేష్‌బాబు, వెంకటేష్ మాట్లాడుతూ రామేశ్వర్ గౌడ్ శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేదానికి ఉపకరిస్తాయన్నారు.

## తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, మే 25(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి కోరారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైసీపీ ఇచ్చిన జీవోను ఏడాది గడుస్తున్నా కూటమి ప్రభుత్వం రద్దు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇతర రాష్ట్రాల్లో తెలుగు మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి కానీ ఆంధ్రప్రదేశ్‌లో లేకపోవడం దారుణమని, ఇంగ్లిష్ రాష్ట్రంగా మార్చాలని చూడడం క్షమించరాని నేరమన్నారు. వైద్య విద్యను ప్రైవేటుపరం చేయవద్దని, సాగునీటి రంగంలో బడ్జెట్‌లో 15శాతం కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్య

పీలేరు, మే 25(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పీలేరులో జరిగింది. పీలేరు ఎస్ఐ లోకేశ్ కథనం మేరకు.. పీలేరు పట్టణం లక్ష్మీపురం కాలనీకి చెందిన వినయ్ కుమార్(30)కు ఆరు నెలల క్రితం చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన శశికళతో వివాహమైంది. పెళ్లైన కొద్ది కాలానికే వారి మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడి పెద్దలు పంచాయితీ చేసేంత వరకు వెళ్లింది. దీంతో శశికళ తన పుట్టింటికి వెళ్లిపోగా ఆమెను తిరిగి తీసుకురావడానికి వినయ్ కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన వినయ్ కుమార్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వినయ్‌కుమార్ మృతదేహం

## ఆధ్యాత్మిక సాహిత్య శిల్పి మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): రామాయణ, భారత, భాగవతాల్లోని పాత్రలను ఆధునిక దృక్పథంతో తీర్చిదిద్దిన ఆధ్యాత్మిక సాహిత్య శిల్పి ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు కొనియాడారు. జిల్లా రచయిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీరామకృష్ణ వాన ప్రస్థాశ్రమం (శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్యాత్మిక జ్ఞాన మందిరం) లో మూల మల్లికార్జునరెడ్డి రచించిన రామాయణ, భారత, భాగవతాల్లో కొన్ని పాత్రలు, తాలూకు పుస్తక పరిచయ సభ నిర్వహించారు. అనంతరం మూలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాబురెడ్డి,రచయిత డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి , నగర ప్రముఖుడు శివరామిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, జి. సత్యనారాయణ, శివరామ్, నాగిరెడ్డి, వానప్రస్థశ్రమ సభ్యులు పాల్గొన్నారు.

## సీమ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

కడప మారుతీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): నిత్యం కరువు కాటకాలు, వలసలు, ఆత్మహత్యలతో అతలాకుతలం అవుతున్న రాయలసీమ ప్రాంత సమగ్రాభివృద్ధికి లక్ష కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలని రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు అవ్వారు మల్లికార్జున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో రాయలసీమ వుందని నాటి పాలకులే చెప్పారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, జె.వి.రమణ, డి.ఎం.ఓబులేసు పాల్గొన్నారు.

## విలువలు కలిగిన వ్యక్తుల సమూహమే మానవత



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

కడప కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): విలువలు కలిగిన వ్యక్తుల సమూహమే మానవత అని మానవత సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి అన్నారు. మానవత నెలవారి సమావేశంలో భాగంగా ఆదివారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక సమావేశం జరిగింది. సభకు డాక్టర్ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు కలిగిన వ్యక్తుల కలయిక జరిగినప్పుడే సమ సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. అనంతరం కేంద్ర కమిటీ డైరెక్టర్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ఈ వేసవిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం దాతల సహకారంతో కొనసాగించామన్నారు. కార్యక్రమంలో పలువురు మానవత సంస్థ ప్రతినిధులు పప్పనబోయిన సుబ్బరాయుడు, పుట్టా సుబ్రహ్మణ్యం, ఎం. సుబ్బిరెడ్డి, బివి. సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## న్యాయవాది జీఎస్ మూర్తికి సన్మానం



కడప ఎర్రముక్కపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం లీగల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించబడ్డ ప్రముఖ న్యాయవాది జీఎస్ మూర్తికి ఆయన స్వగృహంలో జిల్లా బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, జనరల్ సెక్రటరీ గంధం ప్రసాద్ కలిసి పూలబొకే ఘనంగా సన్మానించారు. టీడీపీకి, బలిజ కాపు కులస్థులకు ఎన్నో సేవలు అందించిన జీఎస్ మూర్తికి సముచితస్థానం కల్పించిన చంద్రబాబు, నారాలోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు జిల్లా బలిజ సంక్షేమ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా చాలా మంది పార్టీ కోసం కష్టపడిన నాయకులను టీడీపీ గుర్తించాలని బలిజ, కాపు కులస్థులకు పదవులు ఇచ్చి సముచిత స్థానం ఇవ్వాలని కోరారు.

## మంత్రిని సన్మానించిన వికాస్ హరికృష్ణ


మంత్రి అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న వికాస్ హరికృష్ణ

కడప ఎర్రముక్కపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మాత్యులు అచ్చెన్నాయుడును టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ సత్కరించారు.

## వైభవంగా గంగమ్మ తల్లికి సంప్రోక్షణ

లింగాల,మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమన్నూతల గ్రామంలో ఆదివారం గంగమ్మ తల్లి సంప్రోక్షణ కార్యక్రమాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పురాతనమైన పాలేటి గంగమ్మ దేవస్థానం జీర్ణోద్ధరణ పునఃనిర్మాణం పూర్తిచేశారు. పూజా కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మహాప్రసాదం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వంతెనపై నీరు వెళ్లే దారేది..!

**గతంలో ఇదే పరిస్థితితో కూలిన గడ్డర్లు ● నిర్లక్ష్యం చేస్తే నాటి పరిస్థితే మళ్లీ తప్పదు**


రంధ్రాల్లో పెరిగిన గడ్డి, మొక్కలు


వంతెనపై నిలిచిన వర్షపునీరు

చెన్నూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడప - కర్నూలు జాతీయ రహదారిలో చెన్నూరు వద్ద గల హైవే వంతెనపై వర్షం కురిస్తే నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు పూడిపోయాయి. దీంతో వర్షం కురిసినప్పుడల్లా వంతెనపై నీరు నిలవడం, ఆ నీరు వాహనదారులను ఇబ్బంది పెడుతుంది. పైగా ఇదే వర్షం నీరు ఎక్కువ కాలం నిలిచి ఉంటే వంతెన స్లాబు దెబ్బతినే ప్రమాదం ఉంది. గతంలో పాత వంతెన ఉన్నప్పుడు వర్షం నీరు నిలిచి వంతెన కింది భాగం దెబ్బతినడం, దీంతో లోపలి కడ్డీలు తుప్పుబట్టి గడ్డర్లు ఊడిపోయి వంతెన కొంతభాగం కూలిపోవడం జరిగింది. ఫలితంగా కోట్లాది రూపాయల నష్టంతోపాటు దాదాపు రెండేళ్లకు పైగా రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అదే పరిస్థితి నేడు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పెన్నానదిపై 1956లో అప్పటి గవర్నరు బీమ్‌సేన్ సచార్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిలు శంకుస్థాపన చేసి రెండేళ్లలో పూర్తి చేసి 1958లో ప్రారంభించారు. అప్పటినుంచి దాదాపు 50 ఏళ్లకు పైగా వంతెనకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. అయితే దాదాపు 50 ఏళ్ల తరువాత ఈ వంతెనపై మెయింటెనెన్స్ తగ్గిపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా ఆ నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలలో మట్టి పేరుకుపోయినప్పుడల్లా వాటిని తీయకపోగా, దానిపై అప్పట్లోనే చిన్న చిన్న మొక్కలు మొలవడం, వంతెన కింద భాగం పెచ్చులూడడం జరిగింది. అది కాస్త సమస్య తీవ్రమై వంతెన మధ్యభాగంలో గడ్డర్లు విరిగాయి. ఫలితంగా అప్పట్లో లక్షలాది రూపాయల తోనిర్మించిన వంతెన దెబ్బతింది. ఆ స్థానంలో ప్రస్తుతం కొత్త వంతెన కట్టినా మెయింటెనెన్స్ మాత్రం సక్రమంగా లేదన్న విమర్శలుఎక్కువగా ఉన్నాయి.

**రంధ్రాలు శుభ్రం చేస్తే కదా..:** వర్షం కురిసినప్పుడల్లా ఆ నీరు వంతెనపై నిలబడకుండా ప్రతి 15 నుంచి 20 అడుగులకు ఒక చోట రంధ్రాలు ఏర్పాటు చేశారు. అయితే వంతెన పొడవునా ఉన్న రంధ్రాల్లో చాలా వరకు పూడిపోయాయి. పూడినచోట మట్టి పేరుకుపోయి చిన్న చిన్న గడ్డిమొక్కలు మొలిశాయి. పైగా ఆ గడ్డిని తొలగించకున్నా మట్టిని తీయకపోయినా ఆ రంధ్రాల్లో ఉండే కడ్డీలు తుప్పుబట్టడమో దాని ప్రభావం వంతెన స్లాబులో మిగతా కడ్డీలపై పడే అవకాశం ఉంది. కోట్లాది రూపాయలు వెచ్చించి పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాల్సిన వంతెన చిన్నపాటి నిర్లక్ష్యంతో దెబ్బతింటుందని ఆ పరిస్థితి తీసుకురావద్దని ప్రజలు కోరుతున్నారు.


చెన్నూరు వద్ద వంతెన

## నూతన కమిటీ ఎన్నిక

కడప మారుతీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ కడపజోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన జోనల్ కమిటీతో పాటుగా కడప, అనంతపురం, కర్నూలు రీజినల్ కమిటీలను ఆదివారం స్థానిక ఆర్టీసీ ఆర్.ఎం కార్యాలయ భవన సముదాయ భవనంలో సంబంధిత స్టేట్ అడహాక్ కమిటీ కన్వీన ర్ టీ.వి. రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు ఇందులో జోనల్ గౌరవాధ్యక్షులుగా పి. చిన్నగంగన్న, జోనల్ ప్రసిడెంట్‌గా బి. రఘునాథరెడ్డి, సెక్రటరీగా ఏవీపీ నాయుడు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## హజ్‌హౌస్‌లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలి

కడప మారుతీనగర్, మే 25 (ఆంధ్ర జ్యోతి): కడప నగర శివారు ప్రాంతంలో ఏర్పాటుచేసిన హజ్‌హౌస్‌లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక చిలకలబావి సమీపంలో గల ముస్లిం సమైక్య వేదిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ముస్లింల సౌకర్యార్థం ఏర్పాట చేసిన హజ్‌హౌస్‌లో నేటికీ సివిల్ పనులు కూడా పూర్తి కాలేదన్నారు.సమావేశంలో డాక్టర్లు ఖలీలుల్లా,నవాజువుల్లా పాల్గొన్నారు.

## 'అరెస్టులపై మాట్లాడకపోతే మరచిపోతారు'

పులివెందుల, మే 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డిల అరెస్టుల గురించి మాట్లాడకపోతే బీటెక్ రవిని ప్రజలతో పాటు టీడీపీ నాయకత్వం కూడా మరచిపోతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్పపట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ ఆరోపించారు. ఆదివారం పులివెందులలో వారు విలేకరులతో మాట్లాడారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు


రాష్ట్ర అధ్యక్షున్ని శాలువాతో సన్మానిస్తున్న మురళీమోహన్ యాదవ్

సింహాద్రిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లోమడ మురళీమోహన్ యాదవ్ కలిశారు. కడపలో మహానాడు ఏర్పాట్లను పరిశీలించడానికి వెళ్తూ ఆదివారం పులివెందుల టీడీపీ కార్యాలయానికి వచ్చిన పల్లా శ్రీనివాసరావును మురళీమోహన్ యాదవ్ కలిసి శాలువతో సన్మానించారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘనస్వాగతం


శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న పేర్ల పార్థసారధిరెడ్డి

వేముల, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఘనస్వాగతం పలికారు. మహానాడు ఏర్పాట్ల గురించి చర్చించేందుకు ఆదివారం పులివెందుల టీడీపీ కార్యాలయానికి వెళ్తున్న ఆయనకుటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, ఆయన సోదరుడు పేర్ల శేషారెడ్డి ఘనస్వాగతం పలికారు. శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించిన టీడీపీ నేతలు



పులివెందుల,మే 25 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని శ్రీకృష్ణ ఆలయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖ, జౌళీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ రమణ, సభ్యుల ఆహ్వానం మేరకు శ్రీకృష్ణున్ని దర్శించుకున్నారు. ముందుగా పల్లా శ్రీనివాసరావుకు ఆలయ ప్రధాన అర్చకుడు మనోజ్ ఆచార్యులు, అర్చకులు రాఘవేంద్ర పూర్ణకుంభంతో మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రమణ శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పులివెందుల ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలికి పతీవియోగం


లోమడ సుబ్బారెడ్డి

చెన్నూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బలక్షుమ్మ భర్త లోమడ సుబ్బారెడ్డి (85) ఆదివారం పరమపదించారు. ఈయన గతంలో ఆర్టీసీలో వివిధ హోదాల్లో పనిచేసిన అనంతరం క్రియాశీలకంగా టీడీపీలో తన భార్యతో కలిసి పనిచేయడం జరిగింది. ఈయన మృతి పట్ల మండల టీడీపీ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈయన స్వగ్రామం మండలంలోని శివాలపల్లె. ప్రస్తుతం ఈయన మేనళ్లులు, మాజీ ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, సుదర్శనడ్డి తదితరులు టీడీపీలో పనిచేస్తున్నారు. కాగా ఆయన అంత్యక్రియలు సోమవారం పెన్నాతీరంలో నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

## మహానాడు
## భోజన వసతి ఏర్పాట్ల పరిశీలన


పులివెందులలో భోజన వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, బీటెక్ రవి

పులివెందుల, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలకు పులివెందులలో ఏర్పాటుచేస్తున్న భోజన వసతి ఏర్పాట్లను మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి)తో కలిసి పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటుచేస్తున్న భోజన వసతిని మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం


వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): మెడికేర్ ఆసుపత్రి నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైందని డాక్టర్ మహబూబ్ అలీ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు వంద మంది హాజరైన వారికి ఉచితంగా షుగర్, కొలెస్ట్రాల్, నరాల పటుత్వ పరీక్షలు చేశామన్నారు. వాటితో పాటు రూ.2వేలు విలువైన లివర్ ఫైబ్రోస్కేన్ పరీక్షను కూడా ఉచితంగా చేశామన్నారు. అందరికి ఉచితంగామందులు పంపిణీ చేశామన్నారు. ఈ శిబిరంలో అయేషా, గౌతమి, శిరీషారెడ్డి, భార్గవి, వైష్ణవి, సబిహా, మాధవి, మహిత, షాహిద్ పఠాన్, మెడికల్ రెప్‌లు పాల్గొన్నారు.

## మండలంలో టీడీపీ బ్యానర్లు ఏర్పాటు


జెండాలను కడుతున్న టీడీపీ కార్యకర్తలు

చెన్నూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరిగే మహానాడు పండుగకు చెన్నూరులో మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు చోట్ల బ్యానర్లు, టీడీపీ జెండాలు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక హైవే వంతెనపై ఈ జెండాలను కట్టడంతో అవి రెపరెపలాడుతూ పసుపు పండుగ ఇప్పుడే వచ్చిందా అన్న విధంగా కనిపిస్తోంది. పైగా ఎక్కడ విద్యుత్‌స్తంభాలు, చెట్లు ఏవి ఉన్నా వేటిని వదలకుండా వాటికి జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. కార్యకర్తలు సైతం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. ఈకార్యక్రమాల్లో మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, టీడీపీ నేతలు కొండాల చెన్నయ్య, సుదర్శన్, సురేశ్, రాంప్రసాద్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



# మహానాడు ఏర్పాట్ల పరిశీలన

సీకేదిన్నె, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కడప మహానాడును రాష్ట్ర మంత్రులు, టీడీపీ నేతలు ప్రతిరోజు సందర్శిస్తున్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డితోపాటు మంత్రులు, టీడీపీ నేతలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పనులు నేటితో పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ పనుల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎక్కడా పనులు ఆగకుండా చూస్తున్నారు.

ఆదివారం మహానాడు పనులను మంత్రులు తుమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, ఇన్‌ఛార్జి మంత్రి సవిత, జనార్దన్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పరిశీలించారు. మరోవైపు మహానాడుకు వచ్చే రోడ్లకు ఇరువైపులా, మధ్యలో పసుపు జెండాలు, బ్యానర్లతో స్వాగతాలు పలుకుతూ పసుపుమయంగా మారింది. మరోవైపు రింగ్‌రోడ్డు సర్కిల్‌లో పచ్చదనం పరచుకుంది. ఒకవైపు పచ్చదనం, మరోవైపు పసుపుదనంతో కళకళలాడుతోంది. రాత్రిపూట లైట్లతో ప్రాంగణమంతా లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది.



మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి, మంత్రి రామానాయుడు



# రోడ్డు విస్తరణకు ఆటంకాలు తొలగేనా..?

● పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ● అధికారులు నిర్దేశించిన అడుగుల మేరకు ఆక్రమణలు జరిగేనా అంటున్న ప్రజలు

పోరుమామిళ్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలో రోడ్డు విస్తరణ పనులకు ఆటంకాలు తొలగినట్లేనా? అంటు పట్టణవాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు కూటమి నేతల ప్రయత్నాలు ఫలించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం ఇటీవల అందుకు తగ్గట్టు అధికారులు ఆక్రమణలు తొలగింపునకు మార్కింగ్ ఇవ్వడంతో పట్టణవాసులు ఇక రోడ్ల విస్తరణకు మహర్దశ వచ్చినట్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం రోడ్డు విస్తరణ నిర్దేశించిన అడుగుల మేర చేపడతారా? లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరో పక్క పట్టణంలోని షాపుల యజమానులు మాత్రం రోడ్డు విస్తరణలో తాము ఎంత స్థలం కోల్పోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్ పోరుమామిళ్ల రూపురేఖలు మారుస్తాం, పోరుమామిళ్ల రోడ్డును ఆధునీకరించి సెంట్రల్ లైటింగ్ వేయించి విస్తరణపనులు చేపడతామని గత వైసీపీ హయాంలో రూ.25కోట్లు నిధులు విడుదల చేశారు. కానీ అప్పట్లో ఆలస్యంగా పనులు ప్రారంభమైనా బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కొద్దిరోజులు పనులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అతనికి పార్ట్‌బిల్లులు కూడా అందడంతో రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభించేందుకు సంశయంతో ఉండగా ఇటీవల కూటమి నేతలు అతనితో చర్చించి తిరిగి పనులు ప్రారంభించేందుకు ఒప్పించినట్లు సమాచారం. అగ్నిమాపక కేంద్రం నుంచి మల్లకతవ వరకు రోడ్డుకు ఇరువైపులా 80 అడుగుల వెడల్పుతో విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ అంబేడ్కర్ సర్కిల్ నుంచి బస్టాండు వరకు దేశాయి థియేటరు నుంచి సాయిబాబా దేవాలయం వరకు సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. కానీ పూర్తిస్థాయిలో పనులు పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. దీంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. అంతేకాక షాపుల యజమానులు కొన్ని చోట్ల అభ్యంతరాలు తెలిపిన సందర్భాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆటంకాలను అధిగమించి పనులు పూర్తి చేస్తారా అని సంశయం ప్రజల్లో లేకపోలేదు. ముఖ్యంగా సాయిబాబా ఆలయం నుంచి మల్లకతవ వరకు పనులు చేపట్టలేదు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ట్రాన్స్‌పార్మర్లను, కరెంటు పోళ్లను తొలగించలేదు. అంతేకాక అమరావతికి పోరుమామిళ్ల ప్రధాన రహదారి కావడం, కర్నూలు, బెంగుళూరు, నెల్లూరు, విశాఖపట్టణం, హైదరాబాదు నుంచి వాహనాలకు ఎక్కువగా ఈ రహదారి వెంటే వాహనాలు వెళ్లడంతో రోడ్డు విస్తీర్ణం తక్కువగా ఉండడంతో ఇప్పటి వరకు ప్రజలు, వ్యాపారస్తులు సమస్య ఎదుర్కొన్నారు. అందువల్ల ఈ పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేస్తే ఈ సమస్యలన్నీ అధిగమించవచ్చని స్థానికులు చెబుతున్నారు.


రోడ్డు విస్తరణ కాక ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

## పోలేరమ్మ తల్లికి బోనాలు



బద్వేలు మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలంటూ పట్టణంలోని అబ్బరాతి వీధిలోని పోలేరమ్మ తల్లికి ఆదివారం బోనాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి మొదలైన ఈ బోనాలు ఆదివారం అమ్మవారికి మహిళలు బోనాలు తీసుకెళ్లి సమర్పించడంతో కార్యక్రమాలు ముగిసాయి. ఆదివారం చివరి రోజు కావడంతో అమ్మవారికి చల్లపోసి మహిళలు తమ మొక్కులను తీర్చుకున్నారు.

## పిట్టిగుంటలో ఘనంగా జాతర


వేకువ జామున అమ్మవారికి పొంగళ్ళు తీసుకుపోతున్న మహిళలు

కాశినాయన మే25(ఆంధ్రజ్యోతి):పిట్టిగుంట గ్రామంలో ఆదివారం పోలేరమ్మ జాతరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ గుడి ప్రతిష్ఠ అనంతరం 16 రోజుల కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. ఇందులో భాగంగా వేకువ జామునే అమ్మవారికి మహిళలు భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా పొగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం ఏర్పడింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, జడ్పీటీసీ డి. సత్యనారాయణరెడ్డి వైసీపీ నేత ఎస్. విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


మాతమ్మతల్లి గుడి వద్ద ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బి.కోడూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శిరిగిరిపల్లె గ్రామంలో వెలసిన పురాతన మాతమ్మతల్లి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విరివిగా పాల్గొని ఆ తల్లి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం రాత్రి తల్లి గ్రామోత్సవం, కోలాటం వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు గ్రామ పెద్దలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, వైసీపీ నేత విశ్వనాథరెడ్డి, దుగ్గిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు పరామర్శ

బద్వేలుటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : గువ్వలచెరువు ఘాట్ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, శిరీష, సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారికుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.



## టీడీపీ రాష్ట మాజీ ఉపాధ్యక్షురాలు సుబ్బలక్షుమ్మకు పతీవియోగం

చెన్నూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బలక్షుమ్మ భర్త లోమడ సుబ్బారెడ్డి (85) ఆదివారం పరమపదించారు. ఈయన గతంలో ఆర్టీసీలో వివిధ హోదాల్లో పనిచేసిన అనంతరం క్రియాశీలకంగా టీడీపీలో తన భార్యతో కలిసి పనిచేయడం జరిగింది. ఈయన మృతి పట్ల మండల టీడీపీ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈయన స్వగ్రామం మండలంలోని శివాలపల్లె. ప్రస్తుతం ఈయన మేనళ్లులు, మాజీ ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, సుదర్శనడ్డి తదితరులు టీడీపీలో పనిచేస్తున్నారు. కాగా ఆయన అంత్యక్రియలు సోమవారం పెన్నాతీరంలో నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.


లోమడ సుబ్బారెడ్డి

## కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

జమ్మలమడుగు, మే 25 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో జరిగిన ఘటనకు పాల్పడిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు పిచికెబాబు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగు పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారు కొవ్వొత్తులతో చిన్నారి మృతికి అశ్రునివాళులు అర్పించారు. దురదృష్టకమైన ఈ ఘటన అత్యంత బాధాకరమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు వై.చిన్నయ్య, నరసింహులు, పుట్టా రవి, సీపీఐ ప్రసాద్, నల్లప్ప, ఓబులేసు, కొండయ్య, మల్లి, మురళి, గురప్ప, నాగరాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

## బీచ్ సెపక్ తక్రాలో ఎర్రగుంట్ల క్రీడాకారిణి ప్రతిభ

ఎర్రగుంట్ల, మే 25(ఆంధ్రజ్యోతి):బీచ్ సెపక్ తక్రా (లెగ్‌వాలీబాల్) క్రీడలో ఎర్రగుంట్లకు చెందిన పావన నాగహారికరెడ్డి మంచి ప్రతిభ కనపరచి డబుల్స్‌లో కాంస్య పతకాన్ని సాధించినట్లు రాష్ట్ర సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. మహిళా సెపక్ తక్రాలో డబుల్ ఈవెంట్‌లో 2-0తో గుజరాత్, ఢీల్లీపై గెలుపొందారు. అలాగే ఒరిస్సాతో జరిగిన సెమిఫైనల్స్ పోటీల్లో గట్టిపోటీనిచ్చిన పరాజయం పొందారు. జాతీయ స్థాయిలో తెలంగాణా తరుపున ఆడి బంగారు పతకాలు సాధించగా చైనా, తాయిలాండ్, బ్యాంకాక్ తదితర అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించింది.

## పత్తూరులో ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

ఖాజీపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పత్తూరులో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాలుగవ బహుమతి రూ.15 వేలు గ్రామ పెద్దలు వారికి అందజేశారు.

## కమనీయం అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణంను కమనీయంగా నిర్వహించారు. ఉదయం అగస్త్యేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ కాలక్షేప మండపంలో ఆశీనులను చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణంను తిలకించారు. ఈవో రామచంద్రాచార్యులు, వేద పాఠశాల విద్యార్థులు ఉడుము వెంకటేష్, పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో ఎడిఫై పాఠశాల ఏర్పాటు

ప్రొద్దుటూరు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని కామనూరు వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో ఎడిఫై పాఠశాలను ప్రారంభిస్తున్నామని ఆ పాఠశాల నిర్వాహకుడు అమర్‌నాథ్‌రెడ్డి, గురుదేవ్ రామిరెడ్డిలు తెలిపారు. ఆదివారం ఎడిఫై పాఠశాల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు కోరుకున్న విధంగా అత్యున్నత ప్రమాణాలతో, వసతులతో ఎడిఫై పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు, తల్లిదండ్రుల మధ్య అనుబంధం కొనసాగే విధంగా ఇంటర్మీడియట్ వరకు ఉత్తమ విద్యను అందించడమే తమ పాఠశాల లక్ష్యమన్నారు. పది ఎకరాల విస్తీర్ణంలో ఏసీ క్యాంపస్‌లో రెసిడెన్షియల్, సెమీ రెసిడెన్షియల్‌స్థాయిలో పాఠశాలను ఏర్పాటు చేశామని, రాయలసీమస్థాయిలోనే మొదటిసారిగా రోబోటిక్స్, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, డ్యాన్స్‌రూం, మ్యూజిక్, క్రీడలు, ఆట, పాటలు ఉంటాయని తెలిపారు. ఎడిఫై పాఠశాల ఫ్రాంచైజీని ఏర్పాటు చేశామని, పాఠశాల ప్రారంభోత్సవానికి ఎడిఫైర్ పాఠశాల అధినేత ఎ కే అగర్వాల్ హాజరవుతారని తెలిపారు. ఈనెల 31వ తేదీన పాఠశాల ప్రారంభోత్సవానికి రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌లు హాజరవుతారని తెలిపారు. పాఠశాల ప్రారంభోత్సవానికి పట్టణంలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు వచ్చి వసతులను పరిశీలించాలని కోరారు.



మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముద్దనూరు మే25(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1989-90 పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు ప్రసాద్, రమాదేవి,భారతీ లను ఘనంగా సన్మానించారు. 35 సంవత్సరాల ముందు వారి పాఠశాల జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు. కడప దుర్గమ్మ ఆలయం ధర్మకర్త దుర్గాప్రసాద్ సతీమణి వరదలక్ష్మి, డీఎస్పీ గంగయ్య సతీమణి రాజమ్మ మరికొందరు మాట్లాడుతూ ఇన్నేళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉన్నతపాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు రూ.50,116 నగదు ప్రధానోపాధ్యాయుడు రాజాబాబుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రమేష్, తిరుపతయ్య, ఖదీర్,మురళీ, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట్లలో అపూర్వ కలయిక



ఎర్రగుంట్ల, మే 25(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాల 1992-93 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పాఠశాలలో తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. 32 సంవత్సరాల తరువాత కూడా తమను గుర్తుపెట్టుకుని ఆహ్వానించి గౌరవించడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ గురువులను ఘనంగా సన్మానించారు.

## ఉత్సాహంగా సాగిన కథావసంతం వర్క్‌షాప్

ప్రొద్దుటూరు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రెండో రోజు జేవీవీ ఆధ్వర్యంలో చేపట్టిన కథా వసంతం ఉత్సాహంగా సాగింది.ప్రతి ఒక్కరి జీవితంలోనూ కథలు ఉంటాయని, వాటిని కథల రూపంలో చెప్పగలిగితే సమాజాన్ని ప్రభావితం చేయవచ్చునని రాష్ట్ర తెలుగుభాషా పురస్కార అవార్డు గ్రహీత పలమనేరు బాలాజీ పేర్కొన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ కథావసంతం విజయవంతం కావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కవి కాశీవరపు వెంకటసుబ్బయ్య, మురళీగుప్త, రాజేష్, శిరీష్, రాజశేఖర్, మీనా, దేవానంద్, గురు పాల్గొన్నారు.


కథావసంతంలో పాల్గొన్న చిన్నారులు

## పదోన్నతుల్లో పారదర్శకత పాటించాలి

జమ్మలమడుగు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉమ్మడి కడపజిల్లాలో జరుగుతున్న ప్రధానోపాధ్యాయ పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పిచికెబాబుమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ అధికారులు పదోన్నతుల్లో ప్రతిసారి అడక్వెన్సీ పేరుతో ఎస్సీల 15 శాతం కోటాను తగ్గించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో ఎస్సీల ఉప వర్గీకరణ కోటాను ఏవిధంగా భర్తీ చేస్తారో బహిర్గత పరచాలని ఆయన కోరారు.

## మహానాడును పండుగలా జరుపుకుందాం రండి

● టీడీపీ శ్రేణులకు మాజీ మంత్రి ఉమా, ఎమ్మెల్యే పుట్టా పిలుపు

మైదుకూరు రూరల్ ,మే 25(ఆంధ్రజ్యోతి): కడపలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని పండుగలా జరుపుకొందాం రండి అంటు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావుతో ఎమ్మెల్యే పుట్టా సమావేశమై శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అంతరం ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీలలో తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడు పండుగకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పకుండా రావాలని, ఇది మన టీడీపీ పండుగ అని పిలుపునిచ్చారు.


దేవినేని ఉమాతో ఎమ్మెల్యే పుట్టా

## మైనార్టీ నేతలు తరలివచ్చి జయప్రదం చేయండి

బద్వేలు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి మైనార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ తరలివచ్చి జయ్రపదం చేయాలని రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్‌బాషా పిలుపునిచ్చారు. కడపలో మహానాడు ఏర్పాట్లను పరిశీలించేందుకు విజయవాడ నుంచి బద్వేలు వెళుతున్న ఆయనను తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్‌బాషాలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన మైనార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి సంక్షేమానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యత కల్పించారని, పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు కల్పించడంలో సీఎం ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. మహానాడుకు మైనార్టీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు షేక్ హుసేన్‌పీరా, టీడీపీ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌ఎంబాషా, పఠాన్ మౌళాలి, షేక్ మహబూబ్ బాషా, రసూల్, సందాని, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.


మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ ఖాజీ హసన్‌బాషా

## మహానాడులో కడప సత్తా చాటాలి

● టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, భూపేశ్‌రెడ్డిలు పిలుపు

జమ్మలమడుగు, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే టీడీపీ మహానాడును విజయవంతం చేయడంతోపాటు కడప సత్తాచాటాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.జయనాగేశ్వరరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహానాడుకు జనసమీకరణతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులను చైతన్య పరచి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ కడపలో జరుగబోయే మహానాడును సుమారు వెయ్యి వాహనాల్లో 25 వేల మంది జనసమీకరణతో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టీడీపీ పరిశీలకుడు మద్దూరి రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట మల్లికార్జున, కర్నాటి రామాంజనేయరెడ్డి, గండికోట కిరణ్, శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

## ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటాం

మైదుకూరు రూరల్ ,మే 25(ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. ప్రొద్దుటూరులో పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రమాదాలలో, అనారోగ్యంతో ఆసుపత్రులపాలై డబ్బులు ఖర్చు చేసుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి డబ్బులను అందచేసి ఆదుకొంటామని పుట్టా తెలిపారు. నియోజక వర్గంలో 38 కుటుంబాలకు సుమారు 48 లక్షల,55 వేల,744 రూపాయలను ఎమ్మెల్యే బాధితులకు చెక్కుల రూపంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నులకు మానవత సేవలు అభినందనీయం

ఎర్రగుంట్ల, మే 25(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు ఆపన్నహస్తం అందిస్తూ వారికి అండగా మానవత సంస్థ సేవలు అభినం దనీయమని ఎర్రగుంట్ల మాజీ సర్పంచి, పారిశ్రామికవేత్త సానేపల్లె రవిప్రసా ద్‌రెడ్డి పేర్కొన్నారు. మానవత ఎర్రగుంట్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో వైకుంఠ రథం, ఫ్రీజర్లు ఉచితంగా ఇవ్వడం, పేదలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవడం సంతోషకరమన్నారు. ఛైర్మన్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు వందలాది మందికి ఆర్థిక సహాయం అందించామన్నారు. ఆర్థికంగా ఇబ్బందిపడుతూ అనారోగ్యంతో బాదపడుతున్న వృద్ధ దంపతులకు రూ.4వేల విలువచేసే నిత్యావసర సరుకులను మానవత ద్వారా అందించారు. అలాగే వ్యక్తిగతంగా రూ.3వేలను మానవత సభ్యులు అందించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవత పాలకమండలి, సభ్యులు పాల్గొన్నారు.


వృద్ధ దంపతులకు నిత్యావసర వస్తువులను ఇస్తున్న మానవత సేవాసంస్థ

## విద్యార్థులు ఉన్నత ప్రగతికి బాటలు వేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత ప్రగతిని సాధించడానికి బాటలు వేసుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఉడత వెంకట బసవరావు పద్మశాలీ పేర్కొన్నారు. పద్మశాలీయ కల్యాణ మండపంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో 27వ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్యసాధనకోసం కృషి చేయాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నా వెంకటచంద్రబాబు ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి దాతల సహకారంతో 27 సంవత్సరాలుగా నగదు పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించిన వారితోపాటు ఎంసెట్, జేఈఈ, నీట్, ఐఐటీలలో ఉత్తమ మార్కులు సాధించిన 80 మంది విద్యార్థులకు 2.80 లక్షల రూపాయలు అందజేశారు. 60 సంవత్సరాలు దాటిన అయిదుగురు చేనేత కళాకారులకు రూ.2 వేలు వంతున అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ గంజి మల్లికార్జునప్రసాద్, ఏపీ పద్మశాలీయ సంఘం కోకన్వీనర్ బీమునిపల్లె వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు చెన్నా వెంకటకృష్ణయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు సునంద, అభ్యుదయ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి సాధు అశోక్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నందం కుమార్, మునిస్వామి, అంజనేయులు, నరసింహులు, రవి, రమేష్, ఆనంద్, సంజీవ, జింకా సుబ్రహణ్యం, గోపాలకృష్ణ పాల్గొన్నారు.


పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

## రాచ్చెరువు తూముకు షట్టర్ ఏర్పాటు

కలసపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): బద్వేల్ నియోజకవర్గంలో పెద్దచెరువైన రాచ్చెరువుకు ఆదివారం కొత్తషట్టర్ ఏర్పాటుచేశారు. తుప్పుపట్టి పనిచేయకుండా పోయిన షట్టర్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్త షట్టర్‌ను నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాటుచేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఛైర్మన్ సాయిప్రసాద్, టీడీపీ నాయకులు మార్కెరెడ్డి, పెద్దిరెడ్డి రామకృ ష్ణారెడ్డి రైతులు పాల్గొన్నారు.